# గ్రామాల్లో ప్రారంభమైన సర్వే



**వరంగల్ వాయిస్, మల్హర్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, కుల సర్వే శనివారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రారంభమైంది. గత మూడు రోజులుగా ఇళ్లను గుర్తించి బ్లాక్ ల వారీగా విభజించి శనివారం నుంచి ఇళ్ల వారీగా యజమాని, కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు నమోదు చేస్తున్నారు. ఒక్కో కుటుంబం నుంచి 75 అంశాలపై వివరాలు సేకరించి వాటిని కోడ్ ల రూపంలో నమోదు చేయడానికి చాలా సమయం పడుతుందని ఎన్యూమరేటర్లు తెలిపారు. ఈ సర్వే నవంబర్ 30 వరకు కొనసాగుతుందని, సర్వే సమయంలో కుటుంబ యజమాని అందుబాటులో ఉండి కుటుంబ సభ్యుల వివరాలు చెప్తే సరిపోతుందన్నారు. ఎటువంటి పత్రాలు ఇవ్వవలసిన అవసరం లేదని అధికారులు తెలిపారు.

# రాష్ట్రస్థాయి రగ్బీ క్రీడలకు విద్యార్థుల ఎంపిక



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గత నెల 19న జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా ఆటల పోటీల్లో అండర్-17 విభాగంలో డోర్నకల్ జడ్పీ స్కూల్ పదో తరగతి చదువుతున్న విద్యార్దులు నవనీత్, బాలిక విభాగంలో బిందు సెలెక్ట్ అయ్యారు. దీంతో వీరిద్దరూ ఈ నెల 10 నుంచి 13 వరకు మేడ్చల్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుడు బండి నరసింహారావు, వ్యాయమం ఉపాధ్యాయుడు రవికుమార్ తెలిపారు. క్రీడల్లో రాణించి రాష్ట్ర స్థాయిలో కూడా ఎంపిక కావాలని టీచర్లు అప్పిరెడ్డి, శంకర్, శ్రీనివాస్, కమల, కృపాకాంత, అనిత, సమిత, వసంత రాణి, మంజులత, శేషకుమారి అభిలాషించారు.

# నాంచారమ్మ గుడి మరమ్మతులు వెంటనే చేపట్టాలి




**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామంజపురం గ్రామపంచాయతీ పరిధిలో గల పొలాల మధ్య ఉన్న నాంచారమ్మ గుడిని వెంటనే మరమ్మతులు చేయాలని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు అన్నారు. శనివారం వెంకటాపూర్ మండలంలోని రామంజపురం గ్రామంలో శిథిలావస్థలో ఉన్న శివలింగాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 800 సంవత్సరాల క్రితం నాంచారమ్మ పంచకూటాలయాన్ని రామంజపూర్ గ్రామ పరిధిలో పొలాల మధ్య నిర్మించారు. ఆ గుడికి రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు, రైతులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేసేవారు. ఇప్పుడు ఆ గుడి అక్కడ నుంచి తీసేసి శిల్పాలను ఎక్కడెక్కడో పడేశారని, వెంటనే ఆ శిల్పాలను తీసుకువచ్చి వెంటనే గుడిని నిర్మించాలని డిమాండ్ చేశారు. మా ఆరాధ్య దైవమైన నాంచారమ్మ దేవాలయ ప్రాంతంలో ఎరుకల కులస్తులు అంగరంగ వైభవంగా ఎనిమిది సంవత్సరాల నుంచి జాతర నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా అధ్యక్షుడు కేతిరి భిక్షపతి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు కేతిరి సుభాష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేతిరి రాజశేఖర్, ములుగు జిల్లా కోశాధికారి పాలకుర్తి సురేష్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు దుగాయల బాపు, రాము, కాళేశ్వరం శ్రీరాముల పోషాలు తదితరులు ఉన్నారు.

# క్రీడా నైపుణ్యాలను పెంపొందించడానికే స్పోర్ట్స్ మీట్

## జోనల్ ఆఫీసర్ స్వరూప రాణి



**వరంగల్ వాయిస్, మరిపెడ :** 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్ 2024కు మరిపెడ పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, జూనియర్ కళాశాల వేదికైంది. పాఠశాలలోఈ జోనల్ స్పోర్ట్స్ మీట్ ఈనెల 11 నుంచి 14 వరకు 4 రోజుల పాటు జరగనున్నాయి. ఇందులో4వ జోన్ కు సంబంధించిన ఆరు జిల్లాలలోని 11 గురుకుల పాఠశాలల నుంచి పాఠశాలకు 85 మంది విద్యార్థులకు గాను 11గురుకుల పాఠశాలలకు చెందిన 935 మంది బాలురు, 11రకాలకు చెందిన క్రీడలు, ప్రత్యేకంగా అథ్లెటిక్స్‌లలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా జోనల్ ఆఫీసర్ స్వరూప రాణి శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించడానికే స్పోర్ట్స్ మీట్-2024 ను నిర్వహిస్తున్నామని తెలిపారు. మరిపెడ పాఠశాలలో 10వ జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ ఈ నెల 11నుంచి 14 వరకు జరగనుందని తెలిపారు. ఇందులో అండర్-14, 17,19 బాలుర విభాగంలో వాలీబాల్,బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ,హ్యాండ్ బాల్, కోకో, క్యారం, చెస్, షాట్ ఫుట్, టెన్ని కాయిట్, లాంగ్ జంప్ తో పాటు వివిధ రకాల క్రీడలు, ప్రత్యేకంగా వివిధ స్థాయిల్లో అథ్లెటిక్స్ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. గేమ్స్ సందర్భంగా పాఠశాలకు సెలవులు ప్రకటించామని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి క్రీడలకు వచ్చే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్, ఎంపీ బలరాం నాయక్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలతో పాటు ప్రజా ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ దయాకర్, వైస్ ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్ రావు, పీడీ రవి కుమార్, వెంకటేశ్వర్లు, మీడియా కోఆర్డినేటర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# దోపిడి దొంగల ముఠా అరెస్ట్



**వరంగల్ వాయిస్, కేయూ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏసీపీ దేవేందర్ ఆధ్వర్యంలో కేయూ పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో దోపిడి దొంగల ముఠాను శనివారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే గోదారి శేఖర్, దుర్గం రాజయ్య, లక్ష్మిలు కలిసి ఆటో నడుపుతూ జల్సాలకు అలవాటు పడ్డారు. లక్ష్మి పేరుతో శేఖర్ సిమ్ కార్డు తీసుకొని చౌటుప్పల్ కు చెందిన దేవరపల్లి శ్రీనివాస్ తో హనీ ట్రాప్ చేశారు. నా పేరు లక్ష్మి నిన్ను పెళ్లి చేసుకుంటానని చెప్పి నమ్మించి హనుమకొండకు పిలిపించారు. రాత్రి 8 గంటల సమయంలో గోపాలపురం మధ్యలో శేఖర్, దుర్గం రాజయ్య, దుర్గం లక్ష్మయ్య, లక్ష్మి అతడిని కొట్టి రూ. 24 వేలు, ఒక సెల్ ఫోన్ లాక్కొని వదిలేశారు. ఈ విషయం నువ్వు ఎక్కడైనా చెబితే చంపేస్తామని బెదిరించారు. మరుసటి రోజు కేయూ పోలీస్ స్టేషన్ లో బాధితుడు వచ్చి ఫిర్యాదు చేయడంతో తక్షణమే స్పందించిన సీఐ రవికుమార్, ఎస్ఐలు ప్రవీణ్ కుమార్, రవీందర్, క్రైమ్ సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ నరసింహ రావు, పాషా, కానిస్టేబుల్ రవి, ప్రసాద్ లను ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

# ఉచిత న్యాయ సహాయం అందించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** న్యాయ సేవాధికార సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హనుమకొండ అంబేడ్కర్ భవన్ లో శనివారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు (తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, ఎగ్జిక్యూటివ్ చైర్మన్) జస్టిస్ సుజయ్ పాల్, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి పంచాక్షరి, వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ, వరంగల్- చైర్మన్ బి.వి.నిర్మలా గీతాంబ, హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సీహెచ్.రమేష్ బాబు, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయమూర్తులు, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లు డా.సత్య శారదా, పి.ప్రావీణ్య, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయ సేవాధికార సంస్థల కార్యదర్శులు ఎం.సాయికుమార్, క్షమాదేశ్ పాండే, వివిధ ప్రభుత్వ ఉన్నత అధికారులు, వరంగల్ హనుమకొండ జిల్లాల భార్ అసోసియేషన్ ప్రెసిడెంట్స్ తీగల జీవన్ గౌడ్, యం.రమేష్ బాబు, తెలంగాణ బార్ కౌన్సిల్ మెంబర్లు బైరపాక జయకర్ సిరికొండ సంజీవరావు, ఉమ్మడి జిల్లాల న్యాయవాదులు, డీడబ్ల్యూఓ, డీఆర్డీఏ, మెప్మా, సఖి, భరోసా, బీసీ వెల్ఫేర్, మైనారిటీ, డీఎంహెచ్ఓ, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ తదితరులు హాజరయ్యారు. హైకోర్టు న్యాయమూర్తి (అడ్మినిస్ట్రేషన్ జడ్జి) జస్టీస్ మౌషుమీ భట్టాచార్య వర్చువల్ గా హాజరయ్యారు.

# గుర్రంపేటలో మహిళ దారుణ హత్య

**సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీఐ**

**నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ప్రకటన**



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** భూపాలపల్లి జిల్లా వెంకటాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుర్రంపేటలో అదే గ్రామానికి చెందిన సకినాల సరస్వతి (45) శుక్రవారం రాత్రి హత్యకు గురైంది. ఈ సంఘటన శనివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. గుర్రంపేట గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు ములుగు సీఐ శంకర్ తో పాటు వెంకటాపూర్ ఎస్ఐ జక్కుల సతీష్ వెంటనే గుర్రంపేటకు చేరుకొని హత్య జరిగిన ప్రదేశాన్ని సందర్శించి సంఘటన తీరును పరిశీలించారు. అంతేకాకుండా క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందం సైతం హత్య జరిగిన ప్రదేశాన్ని సందర్శించి ఆధారాలను సేకరిస్తున్నారు. హత్యకు గురైన సరస్వతి భర్త గతంలోనే మృతి చెందగా, ఆమె గ్రామంలో ఒంటరిగా జీవిస్తుంది. ఈ క్రమంలో సరస్వతి శుక్రవారం అర్ధరాత్రి హత్యకు గురైంది. శనివారం ఉదయం రక్తపు మడుగులో నిర్జీవంగా పడి ఉండటాన్ని గమనించిన గ్రామస్తులు వెంకటాపూర్ పోలీసులకు సమాచారం ఇచ్చారని, మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు.